# పల్లెల్లో పచ్చందం

- ఘనంగా ఊరూరా హరితోత్సవం
- మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



కొల్లాపూర్ : కేఎల్ఐ క్వార్టర్స్ లో మొక్కలకు నీళ్లు పోస్తున్న కిషన్‌నాయక్, అధికారులు

కొల్లాపూర్, జూన్ 19 : మండలంలో ఊరూరా తెలంగాణ హరితోత్సవం సోమవారం ఎంతో ఉత్సాహంగా మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగింది. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 18వ రోజు సోమవారం మండలంలోని ఎల్లూరులో ఎంజీకేఎల్ఐ క్వార్టర్స్ ఆవరణలో ఎంపీపీ భోజ్యానాయక్, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణయ్య, సర్పంచ్ బండిలక్ష్మీదేవమ్మ, ఎంపీడీవో చెన్నమ్మ, ఇతర అధికారులతో కలిసి ఆయన పండ్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పేరు బోర్డును ప్రారంభించారు. అనంతరం కిషన్‌నాయక్ మాట్లాడుతూ.. భావితరాల భవిష్యత్ కోసం సీఎం కేసీఆర్ దూరదృష్టితో హరితహారం కార్యక్రమాన్ని యజ్ఞంలా శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ఇప్పటికే ఎనిమిది విడుతలుగా కోట్లాది మొక్కలను పట్టణాలు, గ్రామగ్రామాన ప్రభుత్వ స్థలాల్లో నాటడంతో పచ్చదనం పరిఢవిల్లుతున్నదని తెలిపారు. ఆకుపచ్చని తెలంగాణే లక్ష్యంగా స్వరాష్ట్రంలో ఏర్పాటైన హరితహారంతో పల్లె, పట్నం పచ్చదనంతో మెరిసిపోతుందన్నారు. అలాగే కొల్లాపూర్ పట్టణంలో స్వయం సహాయక మహిళా గ్రూపులు, సి బ్బందితో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మీచారి, మున్సిపల్ కమిషనర్ రాజయ్య కస్తూర్బా పాఠశాలలో మొక్కలు నాటారు. పట్టణ శివారులో మైనార్టీ గురుకుల పాఠశాలలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మహిమూదాబేగానికి విద్యార్థినులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థినులతో కలిసి మొక్కలు నాటి నీళ్లుపోశారు. రామాపురంలో సర్పంచ్ భారతీయాదవ్, ఎంపీటీసీ వరలక్ష్మీయాదవ్‌తో కలిసి రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు నిరంజన్ మొక్కలు నాటారు. ముక్కిడిగుండం గ్రామంలో సర్పంచ్ దశరథ్‌నాయక్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్‌యాదవ్‌తో కలిసి ఎంపీపీ భోజ్యానాయక్ మొక్కలు నాటారు. అలాగే స్థానిక అటవీశాఖ ఆధ్వర్యంలో ఎల్లూరులో కేఎల్ఐ క్వార్టర్స్ ఆవరణలో కొల్లాపూర్, లింగాల ఫారెస్ట్ రేంజర్లు శరత్ చంద్రారెడ్డి, వీరేశ్‌గౌడ్ సమక్షంలో నెరేడు, కొబ్బరి, పండ్ల మొక్కలను నాటారు. అనంతరం మండలంలోని సింగవట్నం హైస్కూల్ ఆవరణలో సర్పంచ్ మండ్లకృష్ణయ్య అధ్యక్షతన మొక్కలు నాటి అటవీ అధికారులు విద్యార్థులకు హరితహారంపై క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుతులను ప్రదానం చేశారు. సోమశిల, మొలచింతపల్లి, ఎన్మన్‌బెట్ల, కుడికిళ్ల, అమరగిరి, చింతలపల్లి, అంకిరావుపల్లి, మాచినేనిపల్లి గ్రామాల్లో హరితోత్సవం ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ అధికారులు, పాల్గొన్నారు.

### పెంట్లవెల్లిలో..

పెంట్లవెల్లి, జూన్ 19 : దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హరితోత్సవం వేడుకలను సోమవారం మండలంలోని జటప్రోల్, గోప్లాపురం, మల్లేశ్వరం, మంచాలకట్ట, మాధవస్వామినగర్, ఎంగంపల్లితండా, పెంట్లవెల్లి, కొండూరు, శింగవరం గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులతో కలిసి వీధులతోపాటు, రహదారుల వెంట మొక్కలు నాటారు. అనంతరం గ్రామస్తులతో కలిసి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు, ఎస్‌కే ఖాజా, గోపాల్‌నాయుడు, విజయ్, సువర్ణమ్మ, ఎంపీడీవో రామయ్య, ఎంపీవో భరత్, ఈజీఎస్ అధికారులు పాల్గొన్నారు.

### పెద్దకొత్తపల్లిలో..

పెద్దకొత్తపల్లి, జూన్ 19 : దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని వెన్నచెర్ల, పెద్దకార్పాముల, గంట్లావుపల్లి, జొన్నలబొగుడ, తదితర గ్రామాల్లో,సోమవారం హరితోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కృష్ణయ్య, సర్పంచులు శ్రీనివాస్‌రెడ్డి, రాధ, చిన్నయ్య, ఇందిర తదితరులు మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో మొక్కలతో కళకళలాడుతున్నాయన్నారు. కార్యక్రమాల్లో ఉపసర్పంచ్ ఎల్లయ్య, కార్యదర్శులు, బీఆర్ఎస్ నాయకులున్నారు.



సింగవట్నంలో విద్యార్థులకు బహుమతులను ఇస్తున్న అధికారులు



పెంట్లవెల్లి : గోప్లాపురంలో మొక్కలు నాటి నీరు పోస్తున్నసర్పంచ్



పెద్దకొత్తపల్లి : వెన్నచెర్లలో మొక్కలు నాటుతున్న దృశ్యం

## నకిలీ ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారి

పెద్దకొత్తపల్లి, జూన్ 19 : నకిలీ ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయాధికారి రమేశ్‌నాయక్ తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీతో ఎరువులు, విత్తనాలు అందిస్తుందన్నారు. ఫర్టిలైజర్ యజమానులు ఎరువులను ప్రభుత్వం సూచించిన ధరలకే విక్రయించాలన్నారు. నకిలీ ఎరువులు అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## ఎస్సైకి సన్మానం



రాజుయాదవ్‌ను సన్మానిస్తున్న మత్స్యసహకార సంఘం నాయకులు

పెద్దకొత్తపల్లి, జూన్ 19 : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఎస్సై రాజుయాదవ్‌ను జిల్లా మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, ముష్టిపల్లి, గ్రామ మత్స్యశాఖ అధ్యక్షుడు మల్లేశ్, వేణయ్య, యుగేంధర్, జగదీశ్, తదితరులు ఎస్ఐని ఘనంగా సన్మానించారు. అనంతరం మత్స్యసహకార సంఘాలకు తమ వంతు సహకారం అందించాలని వారు కోరారు.

## తోతాపరిరకం రైతులు సమాచారం ఇవ్వాలి

కొల్లాపూర్, జూన్ 19 : తోతాపరి రకం మామిడి కాయల కొనుగోలు చేయడానికి తోటలు ఉన్న రైతులు సమాచారం ఇవ్వాలని డివిజన్ ఉద్యానశాఖ అధికారి లక్ష్మణ్ ప్రకటనలో తెలిపారు. ఒకటి, రెండురోజుల్లో తెంచే పరిస్థితుల్లో ఉన్న మామిడి పండ్లను వ్యాపారులు సిద్ధంగా ఉన్నారన్నారు. రైతులు ఈ నెంబర్‌కు 7997725185కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

## ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తులు

కొల్లాపూర్,జూన్ 19 : పట్టణంలో వివేకానంద ఎడ్యూకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఎమ్మెస్ ఆఫీస్, డీటీపీ కాల వ్యవధి రెండు నెలలు ఉందని ఆసక్తి గల యువతీ, యువకులు ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు నిర్వాహకులు భీమయ్య సోమవారం ప్రకటనలో తెలిపారు. స్వామి రామనందాతీర్థ రూరల్ ఇన్స్టిట్యూట్ సహకారంతో కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## మొక్కుబడిగా 'ప్రజావాణి'

వెల్దండ, జూన్ 19 : కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం ప్రజా సమస్యలు పరిష్కారానికి నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం మండల కేంద్రంలో మొక్కుబడిగా సాగుతున్నది. సోమవారం స్థానిక తాసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి మండల అధికారులందరూ డుమ్మాకొట్టారు. వ్యవసాయాధికారి, విద్యుత్, వెటర్నరీ, ఐసీడీఎస్ అధికారులు మినహా మిగతా అధికారులు ఎవరూ ప్రజావాణికి రాలేదు. దీంతో సమస్యలు ఎవరికీ చెప్పుకోవాలని ప్రజలు నిలదీశారు. కలెక్టర్ చొరవ తీసుకొని అధికారులను అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు. తాసీల్దార్‌ను సంప్రదించగా కొన్ని శాఖల అధికారులు హరితహారంలో ఉండగా మిగతావారు రాలేదన్నారు.

## నల్లమట్టి అక్రమ తరలింపు నిలిపివేయాలి

కొల్లాపూర్, జూన్ 19 : పట్టణ శివారులోని ఇటుక బట్టీల నల్లమట్టి తరలింపును ఆపాలని మాలల చైతన్య సమితి నాయకులు సోమవారం మండల తాసీల్దార్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశా రు. పట్టణంలో ఉండే ఇటుక వ్యాపారులు లక్షల విలువచేసే నల్లమట్టిని పట్టణం మీదుగా ఇటుక బట్టీలకు నల్లమట్టిని అక్రమంగా తరలింపు కొనసాగుతున్న సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. అయితే వాస్తవంగా చెరువు, కుంటల్లో ఉండే నల్లమట్టిని రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలకు పంటలకు బలం కోసం వాడుతుంటారని, ఇలా ఇటుకబట్టీలకు తరలించడంతో రైతులకు అందుబాటులో లేకుండా పోతుందని విచారం వ్యక్తం చేశారు. అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోతే కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపడుతామని హెచ్చరించారు. సమితి రాష్ట్ర వర్కింగ్‌ప్రెసిడెంట్ మద్దెలరామదాస్, తాలూకా అధ్యక్షుడు ఎర్రశ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు సురేందర్, సందీప్ పేర్కొన్నారు.

తాసీల్దార్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న మాలలచైతన్య సమితి నాయకులు



## చిరు వ్యాపారికి ఐక్యత చైర్మన్ చేయూత..

వెల్దండ, జూన్ 19 : మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై చెట్టుకింద అన్నం హోటల్ వ్యాపారికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి చేయుతనందించా డు. మండలంలోని చెదురుపల్లి ఉమ్మడి జీ పీ పోచమ్మగడ్డతండాకు చెందిన పాండు మండల కేంద్రంలో చెట్టుకింద భోజనం తయారు చేసే హోటల్ నిర్వహిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న చైర్మన్ సొంత ఖర్చులతో రోడ్డు పక్కన గుడిసే వేసుకునేందుకు ఆర్థికసాయం చేశాడు. సోమవారం హోటల్‌ను పరిశీలించారు. అనంతరం శం కర్ కొండ తండాలో అనారోగ్యానికి గురైన బుజ్జీకి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో రమేశ్ నాయక్, శ్రీరాములు, శ్రీను, లక్ష్మణ్, ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.

## ఆలయాభివృద్ధికి ప్రతిఒక్కరూ తోడ్పాటునందించాలి

వెల్దండ, జూన్ 19 : ఆలయాభివృద్ధికి ప్రతిఒక్కరూ తోడ్పాటునందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ అన్నారు. సోమవారం మండలంలోని అజిలాపూర్ గ్రామంలో పోచమ్మ ఆలయ నిర్మాణానికి బాలాజీసింగ్ రూ.50 వేలు విరాళం అందించారు. అదే విధంగా బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్ రూ.25వేలు విరాళం అందించారు. ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మొగులయ్య, కృష్ణయ్య, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.